www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231

తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు – సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్ – ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 26 | 05-04-2021 | పుటలు : 4

## ఈస్టర్

**ఆగమనం !**

మహిమ రూపాన్ని ధరించటం.
విత్తనం మొక్కగా కొత్త రూపాన్ని సంతరించుకోవటం. మానవ శరీరం వదలి మహిమతో లేవటం.

(పునరుత్థానమును,
జీవమును నేనే !!
యోహాను 11:25)

## విమానాశ్రయంలో గ్యాలరీ ఏర్పాటుపై చర్చ

### వీసీ ని కలిసిన విమానాశ్రయ అధికారులు

**31.03.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును రాజమహేంద్రవరం విమానాశ్రయ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసారు. విశ్వవిద్యాలయంలో బుధవారం వీసీ ని విమానాశ్రయ టర్మినల్ మేనేజర్ నంబి ఆత్రేయబాబు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఆర్.భాస్కర్ కలిసారు. రాజరాజనరేంద్రుడు పాలించిన రాజమహేంద్రవరం చరిత్ర, సంస్కృతి, ఆదికవి నన్నయ సాహిత్య ఔనత్యాలను ప్రతిబింబించే విధంగా విమానాశ్రయంలో ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేసే అంశంపై చర్చించారు. తెలుగు భాషను, స్థానిక సంస్కృతిని ప్రదర్శించేందుకు విమానాశ్రయం చక్కని వేదిక అని దానిని సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. విశ్వవిద్యాలయ ఆచార్యులు వారి సూచనలతో విమానాశ్రయంలో చక్కని సాంస్కృతిక గ్యాలరీని ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరారు. అలాగే విమానాశ్రయంలో తెలుగు భాష ఔనత్యాన్ని తెలియజేసే విధంగా వివిధ కార్యక్రమాలు రూపొందించాలని అన్నారు. వీటిపై వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు సానుకూలంగా స్పందిస్తూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా తెలుగు భాష, సంస్కృతి అభివృద్ధి చెందుతాయని తెలిపారు. మాతృభాష మరియు స్థానిక సంస్కృతి దశదిశలకు వ్యాప్తి చెందుతుందని చెప్పారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో భాష, సంస్కృతి, సాహిత్య ప్రదర్శన శాల మరియు కార్యక్రమాల నిర్వహణకు విశ్వవిద్యాలయం పూర్తి సహకారాన్ని అందిస్తుందని తెలియజేసారు.



విమానాశ్రయ అధికారులకు జ్ఞాపికనందిస్తున్న వీసీ

విమానాశ్రయ అధికారులకు వీసీ జ్ఞాపికను అందజేసి అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ పాల్గొన్నారు.

## బాయ్స్ హాస్టల్ ను పరిశీలించిన రిజిస్ట్రార్




**03.04.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పురుషుల వసతి గృహాలను రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్ శనివారం పరిశీలించారు. వసతి గృహాల్లోని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతపై వంట సిబ్బందిని ఆరా తీసారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నాణ్యతగా భోజనాన్ని సిద్ధం చేయాలని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరిస్తామని సూచించారు. రిజిస్ట్రార్ తో పాటు హాస్టల్ చీఫ్ వార్డెన్ డా.బి.జగన్మోహనరెడ్డి ఉన్నారు.

## కెమిస్ట్రీ విద్యార్థులకు జివికె లో ఉద్యోగాలు

### అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందించిన వీసీ

**03.04.21 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణం మరియు అనుబంధ కళాశాలల్లో కెమిస్ట్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నా విద్యార్థులు జివికె బయోసైన్సెస్ లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. విశ్వవిద్యాలయంలో శనివారం వీసీ చేతుల మీదుగా విద్యార్థులు అపాయింట్మెంట్ ఆర్డర్స్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జివికె బయోసైన్సెస్ వారు ఆన్లైన్ లో ప్లేస్మెంట్ డ్రైవ్ ను నిర్వహించారని విశ్వవిద్యాలయం మరియు అనుబంధ కళాశాలలకు చెందిన ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ విద్యార్థులు 450 మంది దీనిలో పాల్గొన్నారని చెప్పారు. కోవిడ్ కారణంగా ఆన్లైన్ లోనే పరీక్ష మరియు ఇంటర్వ్యూ నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారని తెలిపారు. వీటిలో ప్రతిభ కనపరిచిన 23 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించారని అన్నారు. రాజమహేంద్రవరం క్యాంపస్ విద్యార్థులు ముగ్గురు, తాడేపల్లిగూడెం ఇద్దరు, ఆదిత్య కాలేజ్ తొమ్మిదిమంది, చాంబర్స్ కాలేజ్ ఇద్దరు, ఏబీఎన్ కాలేజ్ ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని అపాయింట్మెంట్ ఆర్డర్ లు అందజేశారు. ప్రస్తుతం వీరంతా ఫైనలియర్ చదువుతున్నారని నాలుగవ సెమిస్టర్ పరీక్షలు రాసిన అనంతరం ఉద్యోగంలో చేరే విధంగా కంపెనీ అవకాశం కల్పించిందని తెలియజేశారు. ఉద్యోగాలలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విశ్వవిద్యాలయం పేరు ప్రఖ్యాతలను పెంచాలని విద్యార్థులకు వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ టి. అశోక్, కెమిస్ట్రీ విభాగాధిపతి డా. బి. జగన్మోహన్ రెడ్డి, జివికె బయోసైన్సెస్ హెచ్.ఆర్ అనూష, జ్యోతిర్మయి పాల్గొన్నారు.



# సంపాదకీయం




## దేవవాణి

*"ఇయం ఆకాశవాణి. సంప్రతి వార్తా: శ్రూయన్తామ్...*
*ప్రవాచక: బలదేవానంద సాగర: ...'*

రేడియోతో పరిచయం ఉన్న శ్రోతలందరికీ ఈ మాటలు జ్ఞాపకమే. నలభై ఏళ్లు ఆల్ ఇండియా రేడియోకి, పదేళ్లు దూరదర్శన్ కి, అర్ధ శతాబ్ది పాటు సంస్కృత భాషా సేవలందించిన పండితులు డాక్టర్ బలదేవానందసాగర్. గుజరాత్ లోని భావనగర్ లో పుట్టి వల్లభిపూర్ లో ప్రాథమిక విద్యను, వారణాసి సంస్కృత విశ్వ విద్యాలయంలో 'శాస్త్రి' ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్., కేంద్రీయ సంస్కృత విద్యాపీఠంలో పిహెచ్.డి., చదువులను, పరిశోధనలను పూర్తి చేశారు. ఉజ్జయిని కాళిదాస్ సంస్కృత అకాడమీకి డైరెక్టర్ గా, NCERT, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వంటి సంస్థలకు సంస్కృత భాష, సాహిత్యాల పరంగా విశేష సేవలందించారు. సంస్కృత భాష ప్రయోగాన్ని సామాన్య జనులకు వినిపించిన వాణి ఆయనది.

సంస్కృతం దేవవాణి. భారతీయ సంస్కృతికి సౌరభం అనదగిన సంస్కృత సారస్వతం ఒక ప్రాచీన జాతికి వాడుక భాషగా,సువిశాల దేశంలో విజ్ఞానుల భాషగా,తరువాత రాజ భాషగా, చివరికి శాస్త్ర భాషగా మిగిలింది. వాల్మీకి మహర్షి రామాయణం ఆదికావ్యం. వ్యాసుడు, కాళిదాసు, భాసుడు, దండి, భవభూతి, భారవి, మాఘుడు మొదలైన కవులు సంస్కృత సారస్వతాన్ని విశ్వవ్యాప్తం చేశారు. కాళిదాస మహాకవి అభిజ్ఞాన శాకుంతలం చదివి విదేశీయుడైన గోథే పండితుడు పరవశించిపోయాడు. తూర్పుగోదావరిలోని ముంగండ (మునిఖండం) ప్రాంతానికి చెందిన జగన్నాథ పండితరాయలు రసగంగాధరం రచన ద్వారా ఢిల్లీ పాదుషావారి లోగిలిలో సన్మానాలు పొందారు.

కొద్ది మాటలలోనే విశాలమైన అర్థాన్ని వ్యక్తీకరించడానికి అనువైనది సంస్కృత భాష. అది జీవ నదియై ప్రవహించి దేశ భాషలనే క్షేత్రాలన్నిటికీ జీవితాన్ని ప్రసాదించి ఫలవంతం చేసింది. ఏ భాషలో మాట్లాడినా భారతీయుల నోటి నుండి వెలువడేవి ఎక్కువ సంస్కృత పదాలే. 'జనని సంస్కృతంబు సకల భాషలకు' అని కీర్తిని పొందింది.

విదేశీ విశ్వవిద్యాలయాలలో మన సంస్కృత భాష, సాహిత్యం, తత్వ శాస్త్ర విషయాలను విదేశీయులు ఎంతో ఆసక్తితో ప్రస్తుతం అధ్యయనం చేస్తున్నారు. దేవనాగరి లిపిలో ఉన్న గ్రంథాలను చదవటానికి ఇబ్బందిగా ఉన్నప్పుడు మనకు తెలుగు, ఆంగ్లంలోనికి అనువాదమైన ఎన్నో సంస్కృత గ్రంథాలు ఇవాళ అందుబాటులో ఉన్నాయి. సంస్కృతం సమాజాన్ని సంస్కరించే సాహిత్యాన్ని కలిగి ఉందని ఆయా గ్రంథాలను అధ్యయనం చేస్తున్నప్పుడు మనం గమనించగలం. చదవడం అనే అలవాటు కొనసాగించగలిగితే భారతీయ సాహిత్య ఔన్నత్యం మనకు అర్థమవుతుంది.

*ఒక భాష పట్ల అభిరుచికి, సాధనకు, సేవకు బలదేవానందసాగర్ మనకు ఆదర్శప్రాయులు. వారికి నన్నయవాణి అభివాదాలు!!*

ఇతి వార్తా: !

## వెబ్ సైట్ డిజైనింగ్ కు వీసీ సూచనలు



**01.04.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వైబ్ సైట్ లో ఎప్పటికప్పుడు సమాచారాన్ని అప్ డేట్ చేసే విధంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ డిజైనింగ్ చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు సూచించారు. విశ్వవిద్యాలయంలో బుధవారం యూనివర్సిటీ వెబ్ సైట్ డిజైనింగ్ పై వెబ్ మాస్టర్ కు వీసీ పలు సూచనలు అందించారు. ఉభయగోదావరి జిల్లాలకు సమాచారాన్ని అందించడంలో కీలక పాత్రను పోషిస్తున్న విశ్వవిద్యాలయ వెబ్ సైట్ ను అందంగా తీర్చిదిద్దాలని అన్నారు.


విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అన్ని సమాచారాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో పొందుపరచాలని తెలిపారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఎన్నో పాఠ్యాంశాలను అందిస్తున్న లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ ను మరింత మెరుగుపరచాలని చెప్పారు. నన్నయవాణి, నన్నయన్యూస్ టీవీ, డయల్ అప్ నన్నయ, స్టూడెంట్ ఫీడ్ బ్యాక్ వంటి కాలమ్ లను ఏర్పాటు చేసి వాటికి తగిన ప్రాధాన్యాన్ని అందించాలని తెలిపారు. విద్యార్థులకు ఆయా కాలమ్స్ లో పూర్తి సమాచారాన్ని అందించే విధంగా తయారు చేయాలని అన్నారు. అందంగా, అప్ డెట్ గా, నాణ్యతగా యూనివర్సిటీ వెబ్ సైట్ ను రూపొందించాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో వెబ్ మాస్టర్ ఎం. శ్రీనివాసరావు, ఎం.వి.రాఘవులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5




బాబు జగజ్జీవన్ రామ్ జయంతి. అభివాదాలతో....
-నన్నయ వాణి.


## మంచి మాట



వినమ్రత(వినయం) ఔదార్యాన్నిస్తుంది. దానితో అన్నిటినీ సాధించవచ్చు. అహంకారం అసూయనిస్తుంది. దానితో అన్నీ కోల్పోవడం జరుగుతుంది.

## రొండా బైర్నే - ది సీక్రెట్






ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు – ఏంటి! ఇలా మొదలుపెట్టారు అనుకుంటున్నారా! అవును ప్రపంచంలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన విజ్ఞానవేత్తలు, వ్యాపార దిగ్గజాలు, కళాకారులు ఎందరో ఉన్నారు. చాలా ఇంటర్వ్యూలలో వారిని మీ జీవిత విజయానికి రహస్యం ఏమిటి? అని అడుగుతుంటారు, ఎన్నో రకరకాల సమాధానాలు వింటుంటాం, అవన్నీ ఇంచుమించు ఇలా ఉంటాయి. ఉదాహరణకి వారెన్ బఫ్ఫెట్ అంటుంటారు, ఈ ప్రపంచలో అత్యంత విజయవంతమైన వ్యక్తులు వారు ఇష్టపడేదాన్నే చేస్తుంటారు... అని. అలాగే మన రతన్ టాటా అంటారు "నేను సరైన నిర్ణయాలను తీసుకోవడం నమ్మను, నేను తీసుకున్న నిర్ణయాన్ని సరైనదిగా చేస్తాను". మనం ఎన్నో జీవిత చరిత్రలు గమనిస్తే అందరి జీవిత విజయంలో రహస్యం, వారివారి పనిని ప్రేమించడం, దీనినే The Law of Attraction అంటారు.

'మనం ఏదైనా సాధించాలనుకున్నప్పుడు, ఈ విశ్వమంతా మనకు తోడుగా దానిని సఫలీకతం చేయడంలో సహాయపడుతుంది' అని ప్రఖ్యాత హిందీ నటుడు షారూఖ్ ఖాన్ అంటుంటారు, ఇది ఆయనకి ఎంతో ఇష్టమైన నవల "ద అల్కేమిస్ట్" నుంచి చెప్పిన మాట. అవును అది ఇక్కడ ఎందుకు ప్రస్తావించాలి, ఎందుకంటే మనం చేసే ప్రతీ పనికి ఈ విశ్వం సహాయం చేస్తుంది కానీ ఎలా అన్నది మనలో చాలా మందికి తెలియదు, కానీ దానికి ఈ పుస్తకం సరైన సమాధానం ఇస్తుంది, అదే "ద సీక్రెట్".


ద సీక్రెట్ అనేది ముందుగా సినిమాగా 2006లో వచ్చింది. అదే సంవత్సరం పుస్తకంగా కూడా ముద్రించబడి ప్రపంచ వ్యాప్తంగా 30 మిలియన్ కాపీలు అమ్ముడైనవి. దీని రచయిత రొండా బైర్నే ఒక నిర్మాత కూడా, ఇది ఒక స్వయంసహాయక పుస్తకం. ఈ పుస్తకం చదవడంవలన ముఖ్యంగా ఉపయోగపడే మూడు విషయాలను నేను ప్రస్తావిస్తాను. అవి మీరు నిజంగా ఏమి సాధించాలనుకుంటున్నారో మీరు నిర్ణయించుకోగల గుతారు. మీకు కావలిసిన సహాయం చేయమని ఈ విశ్వాన్ని అడగగలరు, ఇక్కడ విశ్వం అంటే మీ చుట్టూ ఉన్న ప్రపంచం అదే మీ కుటుంబం, స్నేహితులు మరియు మీ మైండ్ కూడా. ఇక చివరిది మీరు చేపట్టిన పనిని మీరు ఇప్పటికే సాధించినట్లు నమ్మడం అంటే మనం సాధించగలమనే దకృధం మనల్ని విజయానికి చేరువ చేస్తుంది. ఆదేకదా మనం ముందు ప్రస్తావించిన The Law of Attractio. చివరగా ఒక్కమాట– మిమ్మల్ని మీరు జయించాలంటే ఈ పుస్తకం చాలా సహకరిస్తుంది, వీలుచేసుకొని ఒకసారి తిరగేయండి. సెలవు. మరొక పుస్తక సమీక్షలో మళ్ళీ కలుద్దాం.

– డా. నారాయణ నక్కిన (MANAS)




## ప్రతిభా వాణి

### చెళ్ళపిల్ల వేంకట శాస్త్రి



(8.8.1870 – 15.2.1950)

"జండాపై కపిరాజు", "బావా ఎప్పుడు వచ్చితీవు", "చెల్లియో చెల్లకో", "అలుగుటయే ఎరుంగని", "తమ్ముని కొడుకులు", "సంతోషంబున సంధిచేయుడు" అనే ప్రసిద్ధిగాంచిన పద్యాలు గుర్తుండే ఉంటాయి. ఇవి రచించిన జంటకవులలో వారే "శ్రీ చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి" గారు.

చెళ్లపిళ్ల వేంకట శాస్త్రిగారి స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లాలోని కడియం. ఇతర పేర్లు "తిరుపతి వేంకట కవులు", "జంట కవులు" ప్రసిద్ధి: తెలుగు కవిత్వం, నాటకాలు, అవధానం (ప్రప్రథమ శతావధాని), పాండవ జనన- ఉద్యోగ - ప్రవాస - అశ్వమేధ - విజయాలు , శ్రీ కృష్ణ రాయబారం, కాశి యాత్ర, శ్రవణానందం, జాతక చర్య, ఇటీవలి చర్య , 5 వ కింగ్ జార్జ్ పట్టాభిషేక పద్యాలు, మృత్యుంజయ స్తవము మరెన్నో.... వీరు రచించిన పద్యాలెన్నో తెలుగు పౌరాణిక చలన చిత్రాలలో వినిపిస్తాయి. "సూపర్ స్టార్" కృష్ణ నిర్మించి నటించిన "కురుక్షేత్రం" చిత్ర శీర్షికలలో "చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి" గారి పేరు వేసి గౌరవించారు. దివాకర్ల తిరుపతిశాస్త్రి గారితో కలసి అవధానాలు చేశారు.వీరిరువురినే తిరుపతి వేంకట కవులు అంటారు.

**తొలి ఆస్థానకవి చెళ్లపిళ్ల వేంకట శాస్త్రిగారు**

చెళ్లపిళ్ల తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేశారు. ఆయన శిష్యులుగా చదువుకున్నవారు చాలామంది ఆ తర్వాతి కాలంలో తెలుగు సాహిత్యరంగంలో, భాషాశాస్త్రంలోనూ కవులుగా, పండితులుగా ప్రఖ్యాతి పొందారు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు,సాహిత్య చరిత్రకారులు పింగళి లక్ష్మీకాంతం గారు,వేటూరి ప్రభాకర శాస్త్రి గారు చెళ్ళపిల్లవారి శిష్యులు.

కడియంలో వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలు జరుపుతూ వారి రచనల గురించిన సాహిత్యసభలు ప్రతి ఏటా జరుగుతుంటాయి. ఆ మహాకవికి నన్నయవాణి అక్షర నీరాజనం!!

## ఉమేష్ కు వీసీ అభినందనలు



**03.04.21 (మీడియాసెల్)** రాజమహేంద్రవరానికి చెందిన అంతర్జాతీయ టేబుల్ టెన్నీస్ క్రీడాకారుడు ఆచంట ఉమేష్ కుమార్ ఆఫ్రికా ఖండంలోనే ఎత్తైన శిఖరం టాంజానియా దేశంలోని కిలిమాంజరో శిఖరాన్ని అధిరోహించి భారతదేశ జండాను ఎగురవేసారని నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అభినందించారు. శనివారం ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో గోదావరి ఆణిముత్యం అనే ప్రతిష్టాత్మక పురస్కారాన్ని వీసీ కార్యాలయంలో అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నేటి యువత ఉన్నత లక్ష్యాలతో దేశ ప్రతిష్టను ఇమిడింపజేయాలని కృషి, పట్టుదల, ఏకాగ్రత, నమ్మకం, క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చని అందుకు ఆచంట ఉమేష్ నిదర్శనమన్నారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజ యోనా మాట్లాడుతూ గోదావరి ఖ్యాతిని ఖండాంతరాల్లో ఇనుమడింపజేయాలని గోదావరి ఆణిముత్యం పురస్కారాన్ని ఇచ్చామన్నారు. ఉమేష్ మాట్లాడుతూ కేవలం 6రోజుల్లో మార్చి26వ తేదీన కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించి సరికొత్త రికార్డు సాధించానన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్భయ



ఎన్నాళ్లీ దౌర్జన్యాలు
చంపేస్తే తీరని
సమస్యలు
ఎన్నాళ్లీ ఆకత్యాలు
సరిపోవా వేల
ఆత్మహత్యలు
ఎన్నాళ్ళీ చీకటి కోణం
సరిపోదా నిర్భయ చట్టం అలుపెరగని
పోరాటాలు
కునుకెరుగని మా కనురెప్పలు కళ్ళల్లో
రక్త బిందువులు కనబడవా మీ
కన్నులకు?
మా కోసం చట్టాలు ఎన్నో
మా కోసం రక్షణ లెన్నో
మాకోసం చేసేవన్నీ రాతలకే
పరిమితమా..?
చేతల్లో కనబడవా..?
ఇంకెన్నాళ్లు
మా తలరాతను మార్చేదేదో
ఇంకేదో సృష్టించాలి
అప్పుడైనా అడుగంటేనా
ఈ గుండెలను పిండే అరాచకాలు!!

**జలసూత్రపు వీరవరలక్ష్మి.**
**ఎమ్.ఏ.తెలుగు(ప్రథమ)**



సీతాకోకచిలుకలాంటి మనం సృష్టించుకోబోయే గొప్ప అందమైన రంగుల ప్రపంచం మనముందుంది. మన ఆరోగ్యం మనకు చాలా ముఖ్యమైన అంశం. విద్యార్థులారా! మాస్క్, శానిటైజర్, భౌతిక దూరం తప్పనిసరి. జాగ్రత్త!!

**– నన్నయవాణి**

## ఝండా ఊంఛా రహే హమారా

మార్చ్ 31, ఏప్రిల్ 1–1921 మువ్వన్నెల పతాకం రూపకల్పనకు 100 వ పుట్టినరోజు. ఈ సందర్భంగా...




శ్రీ పింగళి వెంకయ్యగారికి నివాళులు!
జాతీయ జెండాకు సెల్యూట్!!

-నన్నయ వాణి.

## నాక్ ఆఫీసును పరిశీలించిన వీసీ



**01.04.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నాక్ కార్యాలయాన్ని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు గురువారం పరిశీలించారు. నాక్ ఎగ్జిక్యూటివ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి, నాక్ కేటగిరిలకు చెందిన సభ్యుల పని తీరుపై ఆరా తీసారు. నాక్ గుర్తింపుకు అవసరమైన ఏడు ప్రమాణాల సమాచారాన్ని సేకరించి నాణ్యతగా సెల్ఫ్ స్టడీ రిపోర్ట్ ను సిద్ధం చేయాలని అన్నారు. మెంటర్ యూనివర్సిటీగా ఉన్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు వాటిని పరిశీలించి అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తారని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వాటిని క్రోడీకరించి నాణ్యమైన రిపోర్టును సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేసారు. ఈ ఏడాదిలోనే నాక్ గుర్తింపును సాధిస్తామని దానికి అందరూ సహకరించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. నాక్ సభ్యులను ఆయా ప్రమాణాల వారిగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపు ఎంతో అవసరమని నాక్ పనికి మొదటి ప్రాధాన్యాన్ని ఇవ్వాలని సభ్యులకు స్పష్టం చేసారు.

## ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

# నైపుణ్యాభివృద్ధి



ప్రతిభను ప్రోత్సహించినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి) మరియు వినూత్న నైపుణ్యాలు, వివిధ విభాగాలలోని విద్యార్థులలో ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. ఎపిఎస్ఎస్‌డిసి విద్యార్థుల ఉపాధి కొరకు వివిధ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు అనుబంధ కళాశాలల్లో ఇప్పటివరకు ప్లేస్‌మెంట్ సెంటర్ ఐటి, అకౌంటింగ్‌కు సంబంధించిన కొన్ని శిక్షణా కార్యక్రమాలను, ప్రతీ ఏడాది జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారు. లైఫ్ స్కిల్స్, సాఫ్ట్‌వేర్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రెజెంటేషన్ స్కిల్స్, ఉద్యోగ నైపుణ్యాలు, పైథాన్ వంటి ఆన్ లైన్ శిక్షణలను అందిస్తుంది. ఇటీవల కోవిడ్ వంటి పరిస్థితుల నేపథ్యంలో ఆన్ లైన్ విధానంలో ప్లెస్మెంట్ డ్రైవ్ ను నిర్వహించి ఉద్యోగాలను కల్పించారు. భవిష్యత్ లో ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం మరిన్ని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని ఆశిస్తున్నాం.













### ఉద్యోగ భరోసాను కల్పించడమే లక్ష్యం

**స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ డా.బి.జగన్మోహనరెడ్డి**



విద్యాభ్యాస అనంతరం ఉద్యోగాలను సమర్థవంతగా నిర్వహిస్తామనే భరోసాను కల్పించడమే యూనివర్సిటీ స్కిల్ డెవప్మెంట్ సెంటర్ ఉద్దేశం. దానికి అవసరమైన కోర్సులను, శిక్షణను ఎపిఎస్ఎస్‌డిసి సహకారంతో నిర్వహిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగావకాశాలను కల్పించేందుకు వారిలో ఉద్యోగ సమర్థ్యాలను పెంచేందుకు ప్రయత్నాలు చేస్తుంది. దీనిలో భాగంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు సహకారంతో స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించిన నూతన కోర్సులను విశ్వవిద్యాలయానికి తీసుకువస్తున్నాం. విశ్వవిద్యాలయం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను భవిష్యత్ లో మరింత బలపరచి విద్యార్థుల ఉన్నతి కొరకు ఉపయోగిస్తాం.

# నన్నయలో హోలీ హుషారు

